ప్రజాశక్తి
శనివారం 25, మార్చి 2023
5
శ్రీ సత్యసాయి



యువత ఉన్నత లక్ష్యాలతో ఎదగాలి

హిందూపురం : సమాజంలో యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఉత్తమ పౌరులుగా మెలగాలని అదనపు జిల్లా జడ్జి శైలజ సూచించారు. శుక్రవారం పట్టణంలోని బాలికల వసతి గృహంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు జీవితంలో అనేక మలుపులు ఎదురవుతుంటాయని సహనంతో వాటిని ఎదుర్కోవాలని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు ఎన్నో ఆశయాలతో తమ పిల్లలను చదువుల కోసం ఇతర ప్రాంతాలకు పంపిస్తుంటారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా మెలగాలని సూచించారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, కృషి పట్టుదలతో విజయం సాధించాలని కోరారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత సమాజాభివృద్ధికి సహకరించాలన్నారు. ముఖ్యంగా మహిళల కోసం అనేక చట్టాలు ఉన్నాయనివాటిపై అవగాహన పెంచుకొని ఇతరుల్లో కూడా చైతన్యం తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పార్వతి, నవేరా, వార్డెన్ భారతి, లోక్అదాలత్ శారద తదితరులు పాల్గొన్నారు.

జరిమానాలు పిండేశారు..

200 శాతం వసూళ్లు
రవాణా శాఖ ఆదాయం
రూ.189.80 కోట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రవాణా శాఖ ఈ ఆర్థిక సంవత్సరంలో జరిమానాలను పిండేసింది. లక్ష్యానికి మించి 200 శాతం అధికంగా జరిమానాలు వేసి వసూలు చేయడం గమన్హాం. తక్కిన వాటిల్లో మాత్రం అనుకున్న లక్ష్యంలో వెనుకబాటు ఉంది. అనంతపురం జిల్లాలో రూ.206 కోట్లు లక్ష్యం కాగా రూ.189.80 కోట్లు చేరుకోవడం జరిగింది. మొత్తం ఐదు విభాగాల్లో రవాణ శాఖకు ఆదాయం సమకూరుతోంది. త్రైమాసిక పన్నులు, లైఫ్ ట్యాక్సు, సర్వీస్ ఛార్జీలు, జరిమానాలు, ఫీజుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 89 శాతం లక్ష్యం చేరుకున్నారు.

జరిమానాల్లో 200 శాతం వసూళ్లు

2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.11.60 కోట్లు అనంతపురం జిల్లా లక్ష్యం కాగా, రూ.24.59 కోట్లు వసూలు చేశారు. నిర్ధేశిత లక్ష్యంలో 211 శాతం చేరుకుంది. మొత్తం ఆదాయం పరంగా చూసినప్పుడు 89 శాతం వరకు చేరింది. రూ.189 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. మొత్తం లక్ష్యాల్లో జరిమానాల్లోనే లక్ష్యం చేరుకోగా తక్కిన అన్నీ లోటు ఉన్నాయి. అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం ఆరు లక్షల వాహనాలు ఉన్నాయి. ఇందులో 70 వేల ట్రాన్సుపోర్టు వాహనాలు ఉన్నాయి. 4.60 లక్షలు ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. 40 వేలు ప్రయివేటు వాహనాలు ఉన్నాయి. తక్కిన 30 వేలు అలైడ్ వాహనాలు ఉన్నాయి. వీటిల్లో చూసినప్పుడు త్రైమాసిక వాహనాల ద్వారా రావాల్సిన ఆదాయం రూ.54.64 కోట్లు లక్ష్యం కాగా, రూ.38.66 కోట్లు ఆదాయం వచ్చింది. 70 శాతం లక్ష్యం చేరుకున్నారు. లైఫ్ ట్యాక్సు ద్వారా రూ.119.19 కోట్లు లక్ష్యం కాగా రూ.89.99 కోట్లు కాగా 75 శాతం లక్ష్యం చేరుకున్నారు. సర్వీసు ఛార్జీల రూపంలో రూ.16.23 కోట్లు లక్ష్యంగా రూ.11.09 కోట్లు చేరుకున్నారు. మొత్తంగా చూసినప్పుడు ఈ ఆర్థిక సంవత్సరంలో 89 శాతం లక్ష్యాలను చేరుకున్నారు.

లక్ష్యానికి చేరువవుతాం..

ఈ ఏడాది ఆర్థిక లక్ష్యం చేరువయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇంకా వారం రోజులు సమయముంది. ఆ లోపు మరింత ఆదాయం సమకూరే అవకాశముంది. అన్ని విభాగాల్లోనూ గతేడాది కంటే మెరుగ్గా ఆదాయం పెంపుదలకు చర్యలు తీసుకున్నాం. చివరకు 90 శాతానికిపైగా ఆదాయం సమకూరుతుంది.

- శివరాం ప్రసాద్, డిప్యూటీ ట్రాన్సుపోర్టు కమిషనర్

ఇదేనా స్వచ్ఛ ఆంధ్ర..!

ఢిల్లీ నుంచి..గల్లీ వరకు ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రతినిత్యం స్వచ్ఛ భారత్.. స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ హిందూపురం.. అని ఉచ్ఛరిస్తున్నారు. అయితే హిందూపురం పట్టణంలో మాత్రం ఇది మాటలకే పరిమితమైంది. హిందూపురంలో పురపాలక సంఘం ఆధీనంలో ఉన్న ప్రయివేటు బస్టాండులో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రయాణికులు అక్కడ ఉన్న ఖాళీ ప్రదేశంలోనే మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం కంపుకొడుతోంది. దీనిని భరించలేక ముక్కులు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. విషయాన్ని స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం గమనార్హం.

కంపుకొడుతున్న పురం బస్టాండ్
పట్టించుకోని
మున్సిపల్ అధికారులు, పాలకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం ఆధీనంలో ఎన్నో సంవత్సరాలుగా ప్రయివేటు బస్టాండ్ ఉంది. ఈ బస్టాండ్ నుంచి నిత్యం వేలాది మంది రాక పోకలు సాగిస్తుంటారు. పాలకులు ఈ బస్టాండ్‌కు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరుతో నామకరణం చేయడంతో పాటు అక్కడ ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అధికార పార్టీ వేడుకలతో పాటు ప్రతి ఏటా వైఎస్ఆర్ జయంతి, వర్ధంతి, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తారు. అయితే బస్టాండులో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో పాలకులు, అధికారులు విఫలం అయ్యారు.

టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలో మరుగుదొడ్ల నిర్వహణ కోసం ఓ గుత్తేదారుకు స్థలాన్ని కేటాయించారు. తానే స్వయంగా మరుగుదొడ్ల నిర్మాణం చేసుకోవడంతో పాటు నిర్వహణ బాధ్యతనూ అప్పగించారు. అయితే ఆ సమయంలో అక్కడ ఉన్న కూరగాయాల మార్కెట్ శిథిలం కావడంతో ఆ స్థలంలో నూతన మార్కెట్ నిర్మాణం చేపట్టాలని దానిని కూల్చారు. మార్కెట్ పక్కన ఉన్న మరుగుదొడ్లకు సైతం వేరే స్థలం కేటాయిస్తామని గుత్తేదారుకు చెప్పారు. నష్ట పరిహారంగా విధించిన గడువును పెంచి ఇస్తామని చెప్పి దానిని కూల్చారు. ఆ సమయంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలోని శిథిలావస్థలో ఉన్న మరో మరుగుదొడ్ల భవనాన్ని వారికి కేటాయించారు. అయితే ఇటీవల పురపాలక సంఘ స్థలంలో సిండికేట్ ఫార్మా సొసైటీ వారు నిర్మాణం చేసిన భవనాలను పురపాలక సంఘం వారు స్వాధీనం చేసుకుని వాటిని కూల్చివేశారు. పక్కనే ఉన్న మరుగుదొడ్ల భవనాన్ని సైతం కూల్చారు. ఇంకా గడువు ఉందని.. ఇదే ప్రాంతంలోనే మరుగుదొడ్ల నిర్మాణానికి మరో స్థలాన్ని కేటాయిస్తామని గుత్తేదారుడికి భరోసా ఇచ్చారు. నిర్మాణం చేపట్టడానికి అధికారులు స్థలాన్నీ కేటాయించారు. అయితే సదరు గుత్తేదారుడు ఇంతవరకు కేటాయించిన స్థలంలో మరుగుదొడ్ల కోసం భవన నిర్మాణం చేపట్టలేదు. దీనికి ప్రధాన కారణం ఆ ప్రాంత కౌన్సిలర్ అడ్డుకోవడమే అని తెలుస్తోంది. దీంతో సదరు గుత్తేదారుడు మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రయాణికులు ఖాళీ స్థలంలోనే మూత్ర విసర్జన చేస్తుండడంతో ఆ ప్రాంతం కంపుకొడుతోంది.



హిందూపురం బస్టాండ్ ఆవరణంలో మూత్ర విసర్జన చేస్తున్న దృశ్యం

గుత్తేదారు ముందుకు రావడం లేదు

పరిగి బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్వహణ కోసం గుత్తేదారుడికి స్థలాన్ని కేటాయించాం. అయితే ఆ గుత్తేదారుడు మరుగుదొడ్ల భవన నిర్మాణం చేపట్టడానికి ముందుకు రావాడం లేదు. గుత్తేదారులతో చర్చించి, భవన నిర్మాణం జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం. అంతవరకు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తాం.

- మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు

నేడు మహిళా సాధికారత సదస్సు

జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి



మాట్లాడుతున్న ఎస్‌పి ఫక్కీరప్ప కాగినెల్లి

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు రాయదుర్గం మండలం 74-ఉడేగోళంలోని మద్దానేశ్వరస్వామి కల్యాణమండపం నందు శనివారం ఉదయం మహిళా సాధికారత సదస్సు జరగనున్నట్లు జిల్లా ఎస్‌పి డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి తెలిపారు. శుక్రవారం ఆయన మద్దానేశ్వరస్వామి సముదాయ భవనం, రాయదుర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శనివారం జరగనున్న సదస్సులో రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షులు జస్టిస్ ఎవి.శేష సాయి, జస్టిస్ రమేష్, జస్టిస్ శ్యామసుందర్ లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. ఈ సదస్సులో బాల్య వివాహ నిరోధక చట్టం, విద్యా హక్కు చట్టం, మహిళా సాధికారతపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అంతేకాక జిల్లాలో నెలకొన్న జోగిని సమస్య పట్ల కూడా అవగాహన కల్పిస్తారన్నారు. 39 మంది జోగినిలకు శాశ్వత భూహక్కు పథకం కింద పట్టాలను పంపిణీ చేస్తారన్నారు. ఆర్డీటీ సంస్థ సహకారంతో ఒక్కో గృహానికి రూ.3 లక్షలు చొప్పున 39 మంది లబ్ధిదారులకు పక్కా ఇళ్ల నిర్మాణానికి రూ.1.20 కోట్ల మెగా చెక్కును ఈ సదస్సులో విడుదల చేస్తారని చెప్పారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రదర్శన స్టాళ్లను ఇక్కడ ఏర్పాటు చేస్తారన్నారు. జస్టిస్ రమేష్ రాయదుర్గం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అయినందున పూర్వ విద్యార్థుల సహకారంతో గురువులకు సన్మానం, పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరుగుతుందన్నారు. జిల్లాలోని పోలీసు, న్యాయ, రెవెన్యూ శాఖల సంయుక్త పర్యవేక్షణలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. మహిళలు ఈ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని, చట్టాల పట్ల అవగాహన కలిగివుండాలని ఎస్పీ కోరారు.

అంతర్రాష్ట్ర సరిహద్దుపై నిఘా ఉంచండి

జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాను ఆనుకొని కర్నాటక రాష్ట్రం ఉన్నందున అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో అక్రమ రవాణాలు జరగకుండా నిఘా పెంచాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్షపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన మట్కా, గుట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ లపై నిఘా పెంచాలన్నారు. మహిళలపై జరిగే నేరాలను కట్టడి చేయడంతో పాటు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగులో ఉన్న యూఐ, గ్రేవ్ కేసుల ఫ్యాక్షన్ సంబంధిత కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులను, సర్కిల్ వారీగా సమీక్ష చేశారు. ఈ కేసుల స్థితిగతులు, పురోగతిపై ఆరా తీశారు. ఆయా కేసుల ఛేదింపునకు మెలకువలు, దిశానిర్ధేశం చేశారు. నేర పరిశోధనా అధికారుల పర్ఫామెన్స్‌ను కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నిందితుల అరెస్టుల విషయంలో నిబంధనలు తు.చ తప్పకుండా పాటించాలన్నారు. ఏమాత్రం అతిక్రమించినా చర్యలు తప్పవని, అక్రమ నిర్బంధం, తదితర చట్ట విరుద్ధమైన పనులు చేయరాదన్నారు. నిందితుల అరెస్టు సందర్భంగా తీసుకోవాల్సిన చట్టపరమైన సూచనలు వివరించారు. పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం కలిగేలా సిబ్బంది పనితీరు ఉండాలన్నారు. అవినీతికి దూరంగా ఉండాలన్నారు. అక్రమ కార్యకలాపాలకు ఎటువంటి అవకాశాలు ఉండకూడదన్నారు. పోలీసు స్టేషన్లకు వచ్చే స్పందన పిటీషనర్ల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, ప్రజల సమస్యలను విని సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఫ్యాక్షన్ కట్టడికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఫ్యాక్షనిస్టులు, వారి అనుచరుల కదలికలపై నిరంతర నిఘా పెట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దొంగతనాలు, దోపిడీలు, తదితర నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళల రక్షణ ముఖ్యంగా భావించాలన్నారు. ఎక్సైజ్ అధికారులతో కలిసి ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందితో సమావేశమై ఏమి చేయాలో.. ఏమి చేయకూడదో దిశానిర్ధేశం చేయాలని తెలిపారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో జరుగుతున్న నేరాలపై ప్రత్యేక నిఘా పెంచాలన్నారు. కీలక కేసుల్లో ఘటనా స్థలంలోని ఆధారాలు సక్రమంగా, శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించి దర్యాప్తు సమగ్రంగా చేపట్టాలని అప్పుడే నిందితులకు శిక్షలు పడే అవకాశముంటుందని చెప్పారు. సాంకేతికతను విరివిగా వినియోగించుకోవాలని, రోడ్డు భద్రతపై దృష్టి పెట్టి రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. పోలీసు విధుల్లో పారదర్శకత, అంకితభావం, నిష్పక్షపాతం ముఖ్యమని తెలియజేశారు. అప్పుడే పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెరుగుతుందని ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ కేవీ రామకృష్ణ ప్రసాద్, ఎస్‌బి డిఎస్‌పి ఉమామహేశ్వర రెడ్డి, పుట్టపర్తి డిఎస్‌పి యశ్వంత్ కదిరి డిఎస్‌పి భవ్య కిషోర్, పెనుకొండ డిఎస్‌పి హుస్సేన్ పీరా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఇతర సిఐ లు, ఎస్ఐ లు, పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం



బెలుగుప్పలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

5న చలో ఢిల్లీకి కార్మిక, కర్షకులు తరలివెళదాం
రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు, బెలుగుప్ప, రాయదుర్గం, కళ్యాణదుర్గం

కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించాలని, మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5వ తేదీన చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి అందరూ తరలి వెళ్లి జయప్రదం చేద్దామని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య పిలుపునిచ్చారు. సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాతా శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలురైతులు, ప్రజల సమస్యలను పరిష్కరించని దుస్థితి నెలకొందన్నారు. అత్యంత ధనవంతులైన ఆదానీ, అంబానీ వంటి వారి సేవలో మునిగి తేలుతూ దేశ రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు ఎదురు తిరగకుండా ఉండేందుకు మతం పేరుతో ప్రజలను విడగొట్టి పరిపాలిస్తున్నారని ఎద్దేవా చేశారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేకంగానూ, ప్రయివేట్ కార్పొరేట్ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందన్నారు. మోడీ విధానాలను తూచా తప్పకుండా పాటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తీరు చాలా బాధాకరమని అన్నారు. ఇటు వంటి ప్రజా వ్యతిరేక విధానాలకు బదులుగా ప్రజానుకూల విధానాల కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక, కర్షక, పోరాట ప్రదర్శనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో శివశంకర, రామయ్య, రాజేశ్వరమ్మ, వెంకటమ్మ, సోమశేఖర్, సరస్వతి, వలీ తదితరులు పాల్గొన్నారు.


రాయదుర్గం : ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాతా శుక్రవారం రాయదుర్గం చేరుకుంది. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ అధ్యక్షతన జరిగిన జీపు జాతాలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సిఐటియు రాష్ట్ర నాయకులు నాగభూషణం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య మాట్లాడారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని, రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అన్ని పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఉపాధి కూలీలకు 200 రోజులు పనులు, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, ఎటువంటి షరతులు లేకుండా కౌలు రైతులందరికీ సిసిఆర్‌సి కార్డులు ఇచ్చి పంట రుణాలు, నష్టపరిహారం, పంటల బీమా సబ్సిడీ ఎరువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్, వాటర్ వర్క్స్ కార్మికులందరిని క్రమబద్ధం చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్ల సాధనకై ఏప్రిల్ 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకుడు నాగరాజు, శంకర్, తిమ్మరాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు లోకేష్, వంశీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ప్రజానాట్యమండలి కళాకారులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాతా శుక్రవారం బెలుగుప్ప మండల కేంద్రానికి చేకుంది. నాయకులు మాట్లాడుతూ.. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం భూ నిర్వాసిత రైతులకు పరిహారం ఇవ్వాలని, అసైన్డ్ సీలింగ్ భూములను పేదలకు పంచిపెట్టాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వడ్డీ లేని పంట రుణాలు, నష్టపరిహారం, బీమా పరిహారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు నాగభూషణం, సిఐటియు మండల కార్యదర్శి భీమన్న, ప్రజానాట్యమండలి కార్యదర్శి శ్రీనివాసులు, హమాలీ యూనియన్ అధ్యక్షులు మారెన్న, పాతన్న, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

చిరుధాన్యాల సాగు చేయడానకి రైతులను అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ బసంత్ కుమార్, జిల్లా వ్యవసాయ మండల చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఈ సమావేశం లో రమణారెడ్డి మాట్లాడుతూ పంటల నమోదుకు సంబంధించి ఈ క్రాపింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేసి నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల సాగు గురించి రైతులలో అవగాహన కల్పించాలన్నారు. 62 శాతం మంది వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడి ఉన్నారని వారందరికీ తగిన సహకారం ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా చిరుధాన్యాలను రైతులకు సబ్సిడీతో అందించి సాగుపై అవగాహన కల్పించాలన్నారు. రబీ సీజన్ కు సంబంధించి విత్తనాల సరఫరా, ఎరువులు, పంటల బీమా నమోదు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. సోమందేపల్లి మండలంలో హంద్రీనీవా నీటి కాలువ ద్వారా 150 మంది రైతులకు సాగునీరు అందించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం గా ప్రకటించినందున చిరుధాన్యాల సాగుకు రైతులలో అవగాహన కల్పించాలన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల, పంటల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. ఏ యంత్ర పరికరాలు ఎంతకు అద్దెకు దొరుకుతాయన్న వివరాలు, ఎరువులు విత్తనాలు వివరాలు ఆర్ బి కె లో ప్రదర్శించాలన్నారు. పాడి ఉత్పత్తులను పెంపొందించాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ, రైతులు పండించిన పంటల వివరాలను ఆన్ లైన్ లో నమోదుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఏపీ సీడ్స్ డిఎం ధనలక్ష్మి, మార్కెటింగ్ శాఖ అధికారి గీతమ్మ, డ్వామా పీడీ రామాంజనేయులు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సిరికల్చర్ జేడీ పద్మమ్మ, పశుసంవర్ధక శాఖ ఎడి శుభాదాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి

లోకేష్ పాదయాత్ర వివరాలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర శనివారం నుంచి కొనసాగుతుందని మాజీ మంత్రి, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఈనెల 21 వరకు పుట్టపర్తి నియోజకవర్గం లోని వణుకు వారి పల్లి వరకు 650 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన లోకేష్ ఉగాది పండుగ సందర్భంగా 22 నుంచి 24 వరకు విరామం ప్రకటించారన్నారు. శుక్రవారం రాత్రికి వణుకు వారి పల్లికి చేరుకుని శనివారం ఉదయం 50వ రోజు పాదయాత్ర ప్రారంభిస్తారని చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి సాగే ఈ యాత్ర ఒడిసి మండలం గాజుకుంటపల్లి 10 గంటలకు చేరుకుని అక్కడ రైతులతో సమావేశమవుతారన్నారు. 10:55 గంటలకు వడ్డీ వారి పల్లికి చేరుకుని అక్కడ ఎస్సీ వర్గాలతో భేటీ అవుతారని చెప్పారు. 12 గంటలకు ఒడిసిలో భోజన విరామం అనంతరం 2:35 గంటలకు ఒడిసి లో తాసిల్దార్ కార్యాలయం సమీపంలో మైనార్టీ వర్గాలతో సమావేశం అవుతారని వివరించారు. సాయంత్రం 4 గంటలకు ఒడిసిలో రెయిన్ బో ఎడ్యుకేషన్ అకాడమీ వద్ద బహిరంగ సభలో లోకేష్ ప్రసంగిస్తారని తెలిపారు. 5:45 గంటలకు మహమ్మదాబాద్ క్రాస్ లో ఆమడగూరు మండల సత్యసాయి వర్కర్లతో సమావేశం ఉంటుందని 6:40 గంటలకు రామయ్యపేట విడిది కేంద్రంలో బస చేస్తారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఒడిసి లో 4 గంటలకు జరిగే బహిరంగ సభకు నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు అభిమానులు భారీగా తరలిరావాలని పల్లె పిలుపునిచ్చారు.

పన్నులపై వడ్డీ మాఫీ

హిందూపురం : పురపాలక సంఘ వ్యాప్తంగా బకాయిలున్న ఆస్తి, ఖాళీ జాగా పన్నులపై వడ్డీ మాఫీని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పురపాలక సంఘంలో పన్నులు చెల్లించకుండా ఉన్న వారి కోసం ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ నెల 31వ తేదీ లోపు బకాయి పన్ను చెల్లించిన వారికి వడ్డీ మాఫీ వర్తిస్తుందన్నారు. పన్నుల వసూళ్ల కోసం ప్రజల సౌకర్యార్థం పురపాలక సంఘ వ్యాప్తంగా ఆరు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు.

వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

కొత్తచెరువు : మండలంలో పలు గ్రామపంచాయతీలో ఖాళీగా ఉన్న వాలెంటీర్ పోస్టుల భర్తీకి అర్హులైన యువతి యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సిద్ధారెడ్డి కోరారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈనెల 24వ తేదీ నుండి 27వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా

తలుపుల : పోషణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక సచివాలయం 1 పరిధిలో 9 వ అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షకులు దీప, ఎఎన్ఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పర్యవేక్షకులు దీప మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పుణ్యవతి, లక్ష్మీదేవి, వెంకటేశ్వరమ్మ, స్వరూప రాణి, సుజాత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగ విద్యార్థులకు చేయూత

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు చేయూతనందించారు. పుట్టపర్తి మండల పరిధిలోని యనమల పల్లి పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, వాటర్ బాటిల్లు, ఎరేజర్లు అందజేశారు. వీటినికిద్మత్ ఎ ఖ. చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు షామీర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

వారపు సంత నిర్వహణకు వేలం

ఓబుళదేవరచెరువు : ఓడి. చెరువు గ్రామపంచాయతీ పరిధిలో వారపు సంత, బస్టాండ్ లోడింగ్, అన్‌లోడింగ్ నిర్వహణ కోసం శుక్రవారం వేలం పాట నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన వేలం పాటలో వారపు సంత నిర్వహణను రూ.3,93,500లకు షేక్ ఇదయతుల్లా అనే వ్యక్తి దక్కించుకున్నాడు. బస్టాండ్ లోడ్ అన్‌లోడింగ్ నిర్వహణను రూ.1,90,500/లకు ఆరీఫ్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి రాజశేఖర్, సర్పంచి గోవిందు, సెక్రటరీలు రామలింగారెడ్డి, రెడ్డి ప్రకాష్, ఉప సర్పంచి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు అమరాపురం విద్యార్థులు

అమరాపురం : మండలంలోని వి. అగ్రహారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన భూమిక, కిరణ్ కుమార్, యువరాజ్ అనే విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికకావటం పట్ల ప్రధానోపాధ్యాయులు కరిబసప్ప, పీడీ రవికుమార్‌తో పాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా పంచమ జ్యోతుల ఉత్సవం

సోమందేపల్లి : మండల కేంద్రంలో తొగట వీర క్షత్రియుల ఆరాధ్య దైవంగా పరిగణింపబడుతున్న చౌడేశ్వరి దేవి పంచమ పంచమ జ్యోతుల ఉత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. తెల్లవారు జామున 3 గంటలకు అమ్మవారి దేవాలయంలో ఉత్సవ విగ్రహానికి ఆలయ ధర్మకర్త డీసీ ఈశ్వరయ్య పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయం, పాతూరు, డీఎల్ రోడ్డు, సంత మార్కెట్ రోడ్డు మీదుగా చెరువు వద్దకు జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు డీసీ వెంకటేశులు, జెడ్పీటీసీ డీసీ అశోక్ కుమార్, వైసిపి జిల్లా సేవాదల్ అధ్యక్షులు, ఉపసర్పంచి వేణు, ఎంపిటీసీ పూజారి ఈశ్వరయ్య, పూజారి శంకర, ఆలయ కమిటీ సభ్యులు, జ్యోతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఎల్ఆర్‌జి'లో సరస్వతి పూజ

హిందూపురం : హిందూపురం రూరల్ మండలం కిరికెర సమీపంలోనిఎల్ఆర్‌జి విద్యాలయంలో శుక్రవారం సరస్వతి పూజా వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ప్రసాద్, ఎఒ సంజీవ రెడ్డి మాట్లాడుతు ఎప్రిల్ 3 నుంచి జరగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయ సంకల్పయాత్ర

ధర్మవరం టౌన్ : వచ్చే ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అవ్వాలని, చిలకం మధుసూదన రెడ్డి ధర్మవరం ఎమ్మెల్యే కావాలని ఆకాంక్షిస్తూ ధర్మవరం జనసేన పార్టీ నాయకులు కేలవత్ నాయుడు నాయక్ ఆధ్వర్యంలో విజయ సంకల్పయాత్ర చేపట్టారు. నాయకులు లక్ష్మీనారాయణ (చిన్న),కడపల సుధాకర్ రెడ్డి,ధారా గంగాధర్,గొంగటి హరి,వెంకటేష్ నాయక్,నారాయణస్వామి నాయక్, మాలేపాటి శ్రీరామ్ తదితరులు ధర్మవరం నుంచి తిరుమలకు కాలినడక యాత్ర కొనసాగించారు.ఈ కార్యక్రమంలో మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి రామాంజనేయులు,మండల అధ్యక్షులు ధర్మవరం నాగ సుధాకర్ రెడ్డి,పుర్రం శెట్టి రవి, చంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సంకల్పయాత్రలో పాల్గొన్న నాయకులు

భవిష్యత్తు టిడిపిదే : మాజీ ఎమ్మెల్యే

కదిరి అర్బన్ : రాష్ట్రంలో రాజకీయ భవిష్యత్తు టిడిపిదే అని మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోవు రోజుల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. గత టిడిపి పాలనలో చంద్రన్న ప్రవేశపెట్టిన పథకాలకు పేర్లు మార్చుకొని జగనన్న సంక్షేమమని చెప్పుకుంటున్న ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల్లో జగన్‌పై వ్యతిరేకత భావాన్ని ప్రజలు వెలుబుచ్చారని అన్నారు. ఇప్పటికైనా వైసిపి ఉన్నన్నాళ్లు ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు సోమ్లా నాయక్, శంకర, హరి, బయ్యప్ప, బాలచంద్ర, మస్తాన్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ఉట్లమాను ఉత్సవం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని దుర్గమ్మ ఆలయం పక్కన శుక్రవారం నిర్వహించిన ఉట్లమాను పరుష అంగరంగ వైభవంగా జరిగింది. ఉగాది పండుగ అనంతరం దుర్గమ్మ ఆలయం వద్ద ఉట్లమాను పరుష నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మొదట దుర్గమ్మ ఆలయంలో ఉట్లమాను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బోయ సామాజికవర్గం వారు సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తప్పెట్లు, డప్పులు వాయిద్యాల నడుమ మహిళలు, ప్రజలు చిందులు వేస్తూ ఉట్లమాను వద్దకు చేరుకున్నారు. ఈ ఉట్లమాను పరుసలో వేలాదిమంది పాల్గొని వేడుకలను తిలకించారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో వన్ టౌన్ సిఐ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



ఉట్లమాను ఉత్సవంలో పాల్గొన్న జనం

యథేచ్ఛగా కల్తీకల్లు దుకాణాల నిర్వహణ



నిల్వ ఉంచిన కల్లును పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారి అన్నపూర్ణ

ప్రజాశక్తి - పరిగి

మండల వ్యాప్తంగా కల్తీకల్లు దుకాణాలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. అధికారులు మాత్రం నామమాత్రపు దాడులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. ఉగాది పండుగను పురస్కరించుకొని విచ్చలవిడిగా కల్తీకల్లు తయారు చేసి గ్రామాలకు తరలిస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం ఉదయం ఎక్సైజ్ అధికారి అన్నపూర్ణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కొడగేనహళ్లి గ్రామ శివార్లలో ఒక ఇటుకల పట్టి వద్ద పెద్ద ఎత్తున కల్లు తయారు చేసి అక్కడినుండి శ్రీరంగరాజుపల్లి, శాసనకోట, మోద, ఇలా పలు ప్రాంతాలకు వాహనాల్లో సరఫరా చేస్తున్నారు. ఈ విషయం స్థానికుల వల్ల తెలుసుకొన్న అధికారులు దాడులు నిర్వహించారు. అయితే అక్కడికక్కడే కల్లు శాంపిల్స్ ను పరిశీలించినప్పటికీ ఫలితం తేలలేదని అందువల్ల చిత్తూరులోని ల్యాబ్‌కు ఈ కల్లు పంపి అనంతరం డిపో చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారి తెలిపారు.

అధికారుల నామమాత్రపు దాడులు

నామమాత్రపు దాడులు : అయితే ఇలాంటి దాడులు తాత్కాలికమైననే ఇటీవలే పలు గ్రామాలలో కల్లు తాగి రోగాల బారిన పడుతున్నారని ఇది కచ్చితంగా కల్తీ కల్లే అని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. హిందూపురానకి చెందిన ఒక వ్యక్తి కొడిగినహళ్లి కేంద్రంగా కల్లు డిపోను ఏర్పాటు చేసి ఇక్కడి నుండే కల్తీకల్లు తయారు చేసి అన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు కల్తీ కల్లు పరీక్షలు చేయడం నామమాత్రంగా జరుగుతోందన వారు విమర్శిస్తున్నారు. ఈ కల్లు తాగిన వారు అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్నారని దళిత సమైక్య జిల్లా అధ్యక్షులు నారాయణ అన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించలేదని విమర్శించారు. ఇప్పుడు డిపో ను మూసి వేయించాల్సిన అధికారులు కల్తీకల్లును తీసుకెళ్లి చిత్తూరు ల్యాబ్లో పరీక్ష నిర్వహిస్తామని అనడం ముమ్మాటికీ వారి వైఫల్యమేనని అన్నారు. మండలంలో అనుమతులు లేకుండా వీధికొక కల్లు దుకాణాన్ని ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్నారని గ్రామీణ ప్రాంతాల్లో మెరుపు దాడులు చేస్తే తప్ప నిర్వాహకులు దొరికే అవకాశం లేదని అన్నారు. ఒక లైసెన్స్ తో పదుల సంఖ్యలో దుకాణాలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు ఈ దుకాణాలను మూసి వేయించాలని లేకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పెనుకొండ : మండలంలోని 44వ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రోడ్డు పై వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్ మీద నుంచి అవతల వైపు రోడ్డు పై వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తున్న పరమేశ్వరపురానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్త అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

నల్లచెరువు : మండల కేంద్రంలోని మేకలవీధికి చెందిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండల పరిధిలోని పెద్ద యల్లంపల్లి కి చెందిన ప్రభాకర్ నాయుడు నల్లచెరువులోని మేకల వీధిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవార తన ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తమ దర్యాప్తులో తేలనుందని ఎస్ఐ వరలక్ష్మి తెలిపారు.

కర్నాటక మద్యం విక్రేత అరెస్టు

రొద్దం : కర్నాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగస్వామి తెలపారు. మండలంలోని పెద్దకొడిపల్లి గ్రామానికి చెందిన సురేష్ లోచర్ల గ్రామంలో కర్నాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడి నుంచి 25 ప్యాకెట్ల కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

లోకేష్ బహిరంగ సభను జయప్రదం చేయండి : పల్లె

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

ఓబుళదేవరచెరువు మండలంలో నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగసభను జయప్రదం చేయాలని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి కోరారు. లోకేష్ లోకేష్ పాదయాత్ర సాగే ప్రాంతాల్లో చేపట్టే ఏర్పాట్లను పల్లె శుక్రవారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లపై తగు సూచనలు, సలహాలు అందించారు. ఓడి చెరువు మండలం వేమారెడ్డి పల్లి వద్ద ఓ ప్రైవేటు పాఠశాల ఎదురుగా ఏర్పాటుచేసిన బహిరంగ సభ వేదిక ఏర్పాట్లను, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. బహిరంగ సభ హాజరైన వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, భోజన ఏర్పాట్లపై స్థానిక టిడిపి నాయకులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పిటిసి పిట్టా ఓబుల్ రెడ్డి, టీడీపీ నాయకులు బోయపల్లి శివారెడ్డి, నిజాం, మల్లా పల్లి ఓబుల్ రెడ్డి, డాక్టర్ పొగాకు జాకీర్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, వెంకట రంగారెడ్డి, కంచి సురేష్, గంటా శ్రీనివాసులు, చికెన్ షాను, మహిళ నాయకులు వైదేహి, మస్తానమ్మ, భాగ్యమ్మ, ఆషాభి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



బహిరంగసభాస్థలి వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న పల్లె రఘునాథరెడ్డి

పెనుకొండ : నారా లోకేష్ యువ గళం పాదయాత్ర లో భాగంగా మండలంలోని గుట్టూరు గ్రామంలో ఏర్పాట్లను టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ సుబ్బరాయుడు, డికె. నాగప్ప, మండల ఉపాధ్యక్షులు నాగరాజు, మండల బిసి సెల్ అధ్యక్షులు ఆదిశేషు, సిద్దప్ప, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలో ఈనెల 26న నారాలోకేష్ పర్యటన సందర్భంగా పాదయాత్ర ఏర్పాట్లను టిడిపి మండల నాయకులు పరిశీలించారు. లోకేష్ పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. బహిరంగ సభ నిర్వహించే స్థలంలో జెసిబితో చదును చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి హిందూపురం పార్లమెంటు కార్యదర్శి నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, మండల నాయకులు వెంకటరెడ్డి, ఫిరోజ్‌బాషా, మనోహర్, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

విద్యార్థుల భవిష్యత్తుకు పునాది పది పరీక్షలే...

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

విద్యార్థుల భవిష్యత్తుకు పునాది 10వతరగతి పరీక్షలేనని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఆత్మీయట్రస్టు చైర్మన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి అన్నారు. ఆత్మీయ ట్రస్టు చైర్మన్ ఆర్థిక సహాయ సహకారంతో యుటిఎఫ్ పట్టణశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బిఎస్ఆర్ బాలికల ఉన్నతపాఠశాలలో సరస్వతిపూజ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో చదివే 200 మంది విద్యార్థినిలకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఆత్మీయట్రస్టు చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి ప్యాడ్స్, పెన్నులు అందజేశారు. పది పరీక్షలలో మంచిఫలితాలు సాధించి ధర్మవరానిక మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ప్రణాళిక బద్ధంగా పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమాపతి, పాఠశాల విద్యాకమిటి చైర్మన్ బైముతక రమణ, మాజీ కౌన్సిలర్ బీరే ఎర్రిస్వామి, యుటిఎఫ్ పట్టణ నాయకులు రామకృష్ణనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పదవతరగతి పరీక్ష కిట్లను అందజేస్తున్న దృశ్యం

పెనుకొండ : ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని 10వ తరగతి విద్యార్థులకు ఉచిత పరీక్ష కిట్లను ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రా రెడ్డి ఆర్థిక సహకారంతో శుక్రవారం పంపిణీ చేశారు. యుటిఎఫ్ పెనుకొండ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జ్యోతిలత అధ్యక్షతన యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సుధాకర్, సీపీఎస్ జిల్లా కన్వీనర్ జిసి. నరేష్, జిల్లా కార్యదర్శి నారాయణ స్వామి, యుటిఎఫ్ నాయకులు పెద్ది రాజు చేతుల మీదుగా 60 మంది విద్యార్థులకు పదవ తరగతి పరీక్షల కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రంగనాయకమ్మ, గాయత్రి, ఆశాజ్యోతి శ్రీదేవి, లావణ్య , రాజేశ్వరి, దీవెన, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడం : కాంగ్రెస్



అంబేద్కర్ సర్కిల్‌లో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్రంలో మతతత్వ అజెండాతో అధికారంలో ఉన్నా మోదీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు పెట్టినా, బెదరింపులకు దిగనా, భయపడే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సుధాకర్ అన్నారు. 2019లో జరిగిన ఎన్నికల సమయంలో జరిగిన ప్రచారంలో బిజెపి కుట్ర పన్ని అక్రమ కేసు నమోదు చేయించి, రెండు సంవత్సరాలు రాహుల్ గాంధీకి శిక్ష విధించడాన్ని నిరసిస్తు శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సర్కిల్‌లో మోకాళ్లపై కుర్చోని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు సుధాకర్, బాలాజీ మనోహర్ మాట్లాడుతు మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా...రాచరికంలో ఉన్నామా అర్థం కావాడం లేదన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రతి ఎన్నికల్లోను మోడీతో పాటు అమీత్ షా, ఇతర బిజెపి నాయకులు ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నా వారిపై ఏలాంటి కేసులు నమోదు చేయకుండా తప్పును తప్పు అని చెప్పిన రాహుల్ గాంధీపై అక్రమ కేసులను పెట్టి, చివరకు న్యాయ స్థానాలను అడ్డు పెట్టుకుని శిక్షలను విధిస్తు ప్రజలను, ప్రతిపక్ష నేతలను భయబ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. భారత్ జోడో యాత్రతో రాహుల్‌తో పాటు కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు రావడంతో పాటు రాహుల్ రాజకీయంగా ఎదుగుతారని తెలిసి అక్రమ కేసులు పెట్టడానికి మతతత్వ పార్టీ పూనుకుందన్నారు. వెంటనే రాహుల్‌పై పెట్టిన కేసులను ఉపసంహరించుకుని, క్షమాపణ చెప్పక పోతే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టి జైల్‌భరో కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, అజ్మతుల్లా, యూనూస్, జమీల్, రామాంజినేయులు, గంగాధర్, మహాబూబ్ భాష, పారుసాబ్, రఫీక్, గౌస్, వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతన్నలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

సక్రమంగా విద్యుత్ సర ఫరా చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు రైతులు మండల కేంద్రం లోని విద్యుత్‌స్టేషన్‌ను శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మండలంలోని పి.సిద్ధిరాపురం, వడ్డిపల్లి, సనప సబ్‌స్టేషన్ల పరిధిలో 9 గంటల కరెంటు సరఫరా చేస్తున్నప్పటికీ ఆత్మకూరు సబ్‌స్టేషన్‌లో మాత్రం 7 గంటలు మాత్రమే ఇస్తున్నారు. అదేమని అడిగితే పవర్ లోడ్ ఉండడం వల్ల సరఫరా చేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారన్నారు. దీంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ట్రాన్స్‌కో ఎఇకి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు ఎఇ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఎన్‌వైకె ఆధ్వర్యంలో పలువురికి సన్మానం

అనంతపురం : వివిధ రకాల సేవలు అందిస్తున్న వారిని ఎన్‌వైకె ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. శుక్రవారం కేంద్ర మంత్రిత్వ యువజన వ్యవహారాల శాఖ, స్పోర్ట్స్ భారత ప్రభుత్వం ఆధ్వర్యవంలో జిల్లా లెవెల్ నైబర్హుడ్ యూత్ పార్లమెంట్-2023 కేంద్ర ప్రభుత్వం జి.20 థీమ్‌లో భాగంగా స్థానిక ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ద్వారా ఉత్తమ సేవలందిస్తున్న ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నగరూరు రసూల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, ఎస్కెయు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళీధర్‌రావు, ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత భరత్, ఎన్‌వైకె శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణకు విస్తృతస్థాయి అవగాహన

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

క్షయ వ్యాధి నివారణపై విస్తృత స్థాయి అవగాహన కల్పించాలని, పూర్తిగా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ బసంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి 2030 కి పూర్తిగా నిర్మూలించడానికి అందరూ కృషి చేయాలన్నారు. రెండు వారాలుగా దగ్గు, జ్వరం వస్తే ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. వెంటనే చికిత్స పొందితే నెల రోజుల్లోనే వ్యాధిని అదుపు చేయవచ్చన్నారు. క్షయ వ్యాధి లక్షణాలు వివరించి ఆ వ్యాధిని అరికట్టడానికి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించి వెంటనే చికిత్స అందించాలన్నారు. జిల్లాలో గుర్తించిన సుమారు 1400 మంది వ్యాధి బాధితులకు ప్రతినెల రేషన్ సరఫరాతో పాటు పోషకాహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పోషకాహారం తీసుకుంటూ చికిత్స తీసుకుంటే వ్యాధిని అరికట్ట వచ్చున్నారు. జిల్లాలో విశ్వనాథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 114 టీబీ బాధితులను దత్తత తీసుకున్నారన్నారు. జిల్లాలో ఇతర స్వచ్ఛంద సంస్థలు బాధితులను దత్తత తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. క్షయ వ్యాధి వల్ల ఆందోళన వద్దని సరైన చికిత్స పొందుతే అరికట్టవచ్చని అన్నారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. విశిష్ట సేవలు అందించిన వైద్య సిబ్బందికి కలెక్టరు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, ఎంపిడిఒ అశోక్ కుమార్ రెడ్డి, డాక్టర్ సెల్వ సల్మాన్, డాక్టర్ తిప్పయ్య, డాక్టర్ కేసి కుల్లాయప్ప, డాక్టర్ తిప్పేంద్ర నాయక్, డాక్టర్ నాగరాజు నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

డిక్కీ రాయలసీమ జోనల్ అధ్యక్షులుగా వెంకటరమణ



వెంకటరమణను అభినందిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

దళిత ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ రాయలసీమ జోనల్ ప్రెసిడెంట్ గా కదిరికి చెందిన వెంకట రమణ కోలా నియామక మయ్యారు. బుధవారం జరిగిన జాతీయ కమిటీ కార్యవర్గం జూమ్ మీటింగ్‌లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెంకటరమణ చెప్పారు. డిక్కీ ఫౌండర్ చైర్మన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత మిలింద్ కాంబ్లే, జాతీయ అధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత రవి కుమార్ నర్రా అధ్యక్షతన ఈ మీటింగ్ నిర్వహించారన్నారు. ప్రస్తుతం రాష్ట్ర కమిటీ లు మాత్రమే ఉండేవని, దళిత వర్గాలలో పారిశ్రామికభ్యున్నతి తీసుకురావడానికి దేశ వ్యాప్తంగా జోనల్ వ్యవస్థ ను తీసుకువస్తున్నారని చెప్పారు. రాబోయే పాతికేళ్లలో ఎస్సీ, ఎస్టీ వర్గాలు పారిశ్రామికంగా బలోపేతం కావడానికి జోనల్ కమిటీలు కృషి చేస్తాయని వారు వివరంచారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మూడు జోనల్ కమిటీలు ఏర్పాటు చేశారనిజాతీయ అధ్యక్షులు పద్మశ్రీ రవి కుమార్ నర్రా పేర్కొన్నారు. రాయలసీమ జోనల్ కమిటీ అధ్యక్షుడిగా వెంకట రమణ కోలా ను నియమిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈసందర్భంగా వెంకట రమణ మాట్లాడుతూ వ్యాపార, వాణిజ్య రంగంలో ఆసక్తి కలిగిన నెల్లూరు, రాయలసీమ జిల్లాలోని దళిత నిరుద్యోగులను గుర్తించి వారికి తగిన నైపుణ్యం కల్పించి వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు.